క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ సుందరయ్య నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు జరుగుతున్నందున సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. న్యూరాజీవ్‌నగర్, ఎంజీజీ కాలనీ, ఎ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

వీఎంసీలో నేడు 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు తిరిగి రాకపోవడంతో అతని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఎన్‌పురం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం రైల్వే రిటైర్డ్ ఉద్యోగి కాస త్రిమూర్తులు(71) అతని భార్య కేదారేశ్వర పటలోని 6వ లైన్‌లో కుమారుడి కుటుంబంతో కలిసి నివాసముంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 23న త్రిమూర్తులు భార్యతో కలిసి రైల్వే ఆస్పత్రిలో మందులు తీసుకుని రైల్వేస్టేషన్ సమీపంలోని ఆర్ఈ కాలనీలోని ఉంటున్న కూతురు ఇంటికి వెళ్లారు. రాత్రి 8.30 గంటల సమయంలో త్రిమూర్తులు ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో త్రిమూర్తులు కుమారుడు కాస వెంకటకుమార్ ఆదివారం ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన తండ్రికి మానసిక స్థితి సరిగా ఉండదని, గతంలో కూడా ఇంటి నుంచి వెళ్లిపోయి కొండపల్లిలో దొరికినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శరవేగంగా రహదారి నిర్మాణ పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీలో రహదారి నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే మల్లాది విష్ణు రూ.9 కోట్లు మంజూరు చేయించారు. దీంతో అంతర్గత రోడ్లతో పాటు మెయిన్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

పెనమలూరు: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి సీఐ వాసంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ గంజాయి సేవించినా, విక్రయించినా, ఘర్షణలకు దిగినా వారిని ఉపేక్షించమన్నారు. వారిపై రౌడీషీట్లు తెరుస్తామన్నారు. సత్ప్రవర్తనతో ఉన్న వారిపై రౌడీషీట్లు తొలగిస్తామని తెలిపారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు వారి ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు. వారి కదలికలపై నిరంతర నిఘా ఉంటుందని తెలిపారు. షీటర్లు ఏదైనా ఊరు వెళితే ముందుగా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. షీటర్లు ప్రతి ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వారి దినచర్యలు తమకు తెలపాలని ఆదేశించారు. రౌడీషీటర్లు శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే నగర బహిష్కరణకు గురవుతారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు రాజేష్, ఉషారాణి, అర్జున్‌రాజు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధురాలికి గాయాలు

కంకిపాడు: బస్సు ఢీకొని వృద్ధురాలు గాయాలపాలైన ఘటన కంకిపాడు బస్టాండు ప్రాంగణంలో ఆదివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన వృద్ధురాలు బస్టాండు నుంచి ప్రధాన రోడ్డు మీదకు వస్తుండగా విజయవాడ నుంచి బస్టాండులోకి వస్తున్న సిటీ బస్సు వృద్ధురాలిని ఢీకొట్టింది. ఘటనలో వృద్ధురాలి కుడిచేతికి బలమైన గాయాలయ్యాయి. స్థానిక ప్రయాణికులు వృద్ధురాలికి సపర్యలు చేసి ఆమెను వైద్యం నిమిత్తం తరలించారు.

సిద్ధమవుతున్న గణనాథులు



వినాయక విగ్రహాలను పరిశీలిస్తున్న భక్తులు



విక్రయాలకు సిద్ధం చేసిన వినాయక విగ్రహాలు

ఉమ్మడి కృష్ణా జిల్లాలో వినాయక చవితి వేడుకలకు గణనాథుల విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. కళాకారులు విగ్రహాలను తీర్చిదిద్దే పనుల్లో నిమగ్నమయ్యారు. మట్టితో పాటు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో 6 అడుగుల నుంచి 13 అడుగుల వరకు విగ్రహాలను తయారు చేస్తున్నారు. గణపతి విగ్రహాలను కొనుగోలు చేసేందుకు వినాయక చవితి ఉత్సవ కమిటీలు, భక్తులు ఆసక్తి చూపుతున్నారు. నున్న మ్యాంగో మార్కెట్‌లో విగ్రహాలను విక్రయానికి ఉంచారు. అందుబాటు ధరల్లో విగ్రహాలను విక్రయిస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. ఇక్కడ తయారైన విగ్రహాలను ఇతర జిల్లాల వాసులు సైతం కొనుగోలు చేయనున్నారు. - మధురానగర్(విజయవాడసెంట్రల్)

ఠాగూర్ గ్రంథాలయంలో సంగీత శిక్షణ



సంగీత పాఠాలు బోధిస్తున్న అధ్యాపకురాలు మాధురి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయం నందు చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా సరస్వతీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు సంగీత శిక్షణ తరగతులు నిర్వహించారు. సంగీత శిక్షకురాలు ఎం.దివ్య మాధురి విద్యార్థులకు సంగీతంపై అవగాహన కల్పించారు. సరళి స్వరాలు అనే అధ్యాయంతో తరగతులు ప్రారంభించారు. దివ్య, మాధురి మాట్లాడుతూ సరళి స్వరాలు, సంగీతంలో వాటి ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకోవాలన్నారు. సరళి స్వరాలు ఎలా రాయాలి? పంచ స్థాయిలను వివరించారు. నోటేషన్ రాసే విధానం, దాని ఆవశ్యకతను తెలియజేశారు. స్థాయిల్లో మధ్య, తారా, మంద్ర, అనుమంద్ర, అతితార స్థాయిలు వివరించారు, సప్త స్వరాలు పలికే విధానాన్ని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థుల చేత సప్త స్వరాలు పలికించి సాధన చేయించారు. తరగతిలో నేర్చుకున్న అంశాలపై ఇంటి వద్ద సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సిబ్బంది వై.ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు



క్యారమ్స్ ఆడుతున్న బ్యాంక్ ఉద్యోగినులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆటల పోటీలు నిర్వహించారు. సూర్యారావుపేటలోని బ్యాంక్ రీజినల్ కార్యాలయం వద్ద ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్, విజయవాడ మాడ్యూల్ మెట్రో రీజియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఆదివారం పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా బ్యాంక్ సిబ్బంది పిల్లలకు మ్యూజికల్ చైర్స్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు చేపట్టారు. సిబ్బంది కోసం క్యారమ్స్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో యూనియన్ ప్రతినిధులు, బ్యాంకు సిబ్బంది, కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యూనియన్ రీజినల్ సెక్రటరీ బదరిబాబు మాట్లాడుతూ.. పోటీల్లో విజేతలకు సెప్టెంబర్ 1వ తేదీన బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. యూనియన్ ప్రాముఖ్యతను వివరించారు. సభ్యులంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. యూనియన్ సహాయ కార్యదర్శి కె.టి.చక్రవర్తి, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీభ్రమర టౌన్‌షిప్స్ ప్రీ లాంచ్ వేడుకలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న గల్లా రామచంద్రరావు, డైరెక్టర్లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): శరవేగంతో అభివృద్ధి చెందుతున్న విజయవాడ మహానగరం ప్రాంతంలోని గంగూరు వద్ద శ్రీభ్రమర బ్యాంకర్స్ కాలనీ పేరుతో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది. శ్రీభ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ విజయవాడ బెంజిసర్కిల్‌లో ఆదివారం నిర్వహించిన ప్రీ లాంచ్ వేడుకలు ఘనంగా జరిగాయి. బ్యాంకర్ల మద్దతు, వారి అందించిన సహకారాన్ని గుర్తు చేసుకుంటూ కేవలం బ్యాంకింగ్, ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న ఉద్యోగుల కోసం శ్రీభ్రమర బ్యాంక్ కాలనీ పేరుతో ఈ వెంచర్‌ను ప్రారంభించినట్లు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రరావు ప్రాజెక్ట్‌ను లాంచ్ చేసి బ్రోచర్‌ను విడుదల చేశారు. వేడుకల్లో సంస్థ డైరెక్టర్ మారం చంద్రశేఖర్, ఎంఎస్ రాజు, శైలారెడ్డి కోటా, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



సునీల్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: శ్రీ స్రవంతి కృష్ణ ఎంటర్‌టైనర్స్ ఈవెంట్స్, తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికపై ఆదివారం నిర్వహించిన తెలుగు, హిందీ చిత్రగీతాల కార్యక్రమం అలరించింది. స్రవంతి కృష్ణ నేతృత్వంలో గాయనీ గాయకులు మల్లాది స్వాతి, బుర్రేదం పద్మశ్రీ, బుర్రేదం కృష్ణ, కె.దుర్గానాగమణి, శ్రీనివాసరావు తెలుగు హిందీ చిత్రగీతాలను ఆలపించారు. గాయకుడు మచిలీపట్నానికి చెందిన సునీల్‌ను నిర్వాహకులు సత్కరించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ.. గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. సంస్థ అధ్యక్షుడు స్రవంతి కృష్ణ సంస్థ లక్ష్యాలను వివరించారు. వివిధ రంగాలకు చెందిన కేఎస్ఎన్ మూర్తి, డేవిడ్ రాజు, బీవీ వీరభద్రరావు, కారుమంచి రాజు తదితరులు పాల్గొన్నారు.

మధురంగా అన్నమయ్య సంకీర్తనాధార



అన్నమయ్య సంకీర్తనలను గానం చేస్తున్న విష్ణు ప్రియ, సాయి ప్రజ్ఞ

విజయవాడకల్చరల్: దృశ్యవేదిక సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనాధార, కూచిపూడి నృత్యహేల మధురంగా సాగింది. యువ గాయనీమణులు ఒ.విష్ణుప్రియ, సాయి ప్రజ్ఞ తాళ్లపాక అన్నమాచార్యుడు రచించిన పద కవితలను ఆలపించారు. మృదంగంపై పీవీ ప్రసాద్, వయోలిన్‌పై పాణ్యం దక్షిణామూర్తి సహకరించారు. కూచిపూడి నృత్యహేల కార్యక్రమంలో భాగంగా నాట్యాచార్యులు అజయ్‌కుమార్, ఎ.సంతోష్, యల్లా జోస్యుల అనూరాధ, లేఖ్యాభరణి తమ బృందాలతో నృత్యాభిషేకం చేశారు. దృశ్య వేదిక వ్యవస్థాపకుడు హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. పద కవితకు ఆద్యుడు తాళ్లపాక అన్నమాచార్యుడని అభివర్ణించారు. కార్యక్రమంలో దృశ్యవేదిక నిర్వాహక సంఘ సభ్యులు పద్మశ్రీ హేమంత్, బి.నరేన్, మాజేటి సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

ఇస్రో శాస్త్రవేత్త తల్లిదండ్రులకు సత్కారం

ఉయ్యూరు: చంద్రయాన్-3 విజయంలో కీలక పాత్ర పోషించిన శాస్త్రవేత్తల్లో ఒకరైన మదిర చైతన్య తల్లిదండ్రులను ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల బాధ్యులు ఆదివారం సత్కరించారు. చంద్రయాన్ 3 ప్రయోగంలో ఈ కేటగిరీ విభాగంలో పనిచేసిన మదిరచైతన్య స్వగ్రామం ఉయ్యూరు కావటంతో ఆయన తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు దంపతులను బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు జంపాన శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో పౌరసన్మానం చేశారు. పట్టణంలోని తోట్లవల్లూరురోడ్డులో వెంకటేశ్వరరావు నివాసానికి వెళ్లి సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ డాక్టర్ జంపాన పూర్ణిమ, రాజులపాటి చిన్ని, మాజీ జెడ్పీటీసీ రాజులపాటి రామచంద్రరావు, ఏజీఅండ్ఎస్‌జి జూనియర్ కళాశాల డైరెక్టర్ జిజెపి వినయ్‌కుమార్, సీనియర్ జర్నలిస్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'కు దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు అక్టోబర్ 2 నుంచి నవంబర్ 8వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 వేల గ్రామ సచివాలయాలు, 4 వేల వార్డు సచివాలయాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. క్రీడల్లో పాల్గొనడానికి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. 15 ఏళ్లు దాటిన యువత ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని, ఇందులో వలంటీర్లు, సచివాలయం సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు అనర్హులని పేర్కొన్నారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండు, మూడు బహుమతులు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు నగదు బహుమతులు అందిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 15 వేల సచివాలయాల పరిధిలో తొలుత పోటీలు ప్రారంభమవుతాయని, అనంతరం మండల, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలను నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సమస్యల సాధన కోసం అంగన్‌వాడీ వర్కర్ల సంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఓబులేసు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘాల ఆధ్వర్యంలో సిద్ధార్థ ఆడిటోరియంలో అంగన్‌వాడీ వర్కర్ల అండ్ హెల్పర్స్ రాష్ట్ర సదస్సు ఆదివారం జరిగింది. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, పింఛన్ ఇవ్వాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ప్రేమ, ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.భారతి మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అంగన్‌వాడీ సంఘాల సభ్యులు, రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

28 మంది జూదరుల అరెస్ట్

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న గ్రామంలో పలతిప్ప వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్న 15 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు, నున్న గ్రామస్తుల నుంచి అందిన సమాచారం మేరకు పలతిప్ప వద్ద మామిడితోటలో కోడిపందేలు వేస్తున్న శిబిరంపై దాడి చేశామన్నారు. 15 మందిని అదుపులోకి తీసుకోని, వారి నుంచి రూ.13,820, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నామన్నారు. 15 మందిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

పేకాడుతున్న 13 మంది..

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీ ఎ బ్లాక్ వద్ద వేస్ట్ పేపర్ కంపెనీలో పేకాడుతున్న 13 మందిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. తమకు వచ్చిన సమాచారం మేరకు వేస్ట్ పేపర్ కంపెనీ లోపల తనిఖీలు నిర్వహించామని సీఐ కె.శ్రీనివాసరావు చెప్పారు. పేకాడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 16,680 రూపాయలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

భళా.. ఆంధ్ర నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడకు చెందిన శ్రీనటరాజ నృత్యాలయానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన ఆంధ్ర నృత్య ప్రదర్శన భళా అనిపించింది. ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై చిన్నారులు ఆంధ్ర నృత్య ప్రదర్శన ఇచ్చారు. పలువురు చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి అభినయంతో నృత్య ప్రదర్శన ఇవ్వగా, భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సారె సమర్పణ



సారె ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి, భక్తులు

పాయకాపురం(విజయవాడరూరల్): అమ్మవారి దయ ఉంటే అందరికీ మేలు జరుగుతుందని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆర్యవైశ్య సేవా సంఘం 61వ డివిజన్ అధ్యక్షుడు పేరం కృష్ణ దంపతుల ఆధ్వర్యంలో వాసవీ అమ్మవారికి శ్రావణమాస సారె ఊరేగింపు మహోత్సవం ఆదివారం జరిగింది. ఊరేగింపులో ఎమ్మెల్యే వెలంపల్లి పాల్గొని అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శాంతినగర్ నుంచి ప్రకాష్‌నగర్, సుందరయ్యనగర్ మీదుగా రాజీవ్‌నగర్‌లోని వాసవీ అమ్మవారి దేవస్థానం వరకు శ్రావణ మాస సారె ఊరేగింపు చేపట్టారు. అనంతరం శ్రీ మరకత వాసవీ అమ్మవారి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. అమ్మవారి సారెను పేరం కృష్ణ దంపతులు సమర్పించారు. రకరకాల పిండి వంటలు, పూలు, పండ్లతో అమ్మవారికి సమర్పించి పూజలు నిర్వహించారు. మంగళ వాయిద్యాల నడుమ, వందల సంఖ్యలో భక్తులు, చిన్నారులు, డప్పులతో, కోలాటం చేస్తూ వీధుల్లో ఊరేగింపుగా అమ్మవారికి శ్రావణమాస సారెను సమర్పించారు. ఊరేగింపులో విజయవాడ అర్బన్ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు పల్లెపోతు మురళీకృష్ణ, 57, 60, 62, 63, 64 డివిజన్ల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీవన శైలి, ఆహారపు అలవాట్లలో మార్పు అవసరం



సదస్సులో మాట్లాడుతున్న వైద్యురాలు భారతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జీవన శైలి, ఆహారపు అలవాట్లలో మార్పుల కారణంగా అనేక రుగ్మతలు సంభవిస్తాయని వైద్యురాలు భారతి అన్నారు. బందరు లాకుల సమీపంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, సెయింట్ ఆంథోనీ ఆరాధ్య మెడికల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఊపిరితిత్తులు, మధుమేహం వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న వైద్యురాలు భారతి మాట్లాడుతూ.. వయస్సు రీత్యా ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని సూచించారు. రక్తపోటు, మధుమేహం వంటివి అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. అన్ని వ్యాధులకు ఆహారంలో తీసుకునే ఉప్పు, పులుపు, మసాలాలు వంటివే కారణమన్నారు. వాటి వాడకాన్ని నియంత్రించాలని సూచించారు. వృద్ధాప్యంలో వైద్యుని పర్యవేక్షణలో అవసరమైన చికిత్సలు చేయించుకోవాలన్నారు. వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సదస్సులో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేమూరు బాబూరావు, ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, వల్లూరి రామారావు, వైద్యులు సుబ్బారావు, ప్రమోద్ కుమార్, వివేక్ పాల్గొన్నారు.

220 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య విషయాల్లో అవగాహన పెంచుకోవాలని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్యుడు కోనా వీరబ్రహ్మం అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వృద్ధులకు ఆరోగ్య అవగాహన ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హోమియో, ఆయుర్వేదంతో అన్ని రకాల వ్యాధులను నయం చేయవచ్చన్నారు. అనారోగ్యం వచ్చిన తరువాత మందులు వాడటం కన్నా వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 220 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమాలను వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ పర్యవేక్షించారు.

మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న రాంబాబు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తెలుగు మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత అని అభ్యుదయ రచయితల సంఘం(అరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొప్పర్తి రాంబాబు అన్నారు. స్థానిక ప్రజాశక్తి నగర్‌లోని చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయంలో గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాష దినోత్సవం ఆదివారం జరిగింది. రాంబాబు మాట్లాడుతూ.. తెలుగు అనే పదంలోనే ఎంతో మాధుర్యం ఉందన్నారు. తెలుగు భాష అమ్మదనం నిండిన కమ్మనైన భాష అన్నారు. మాతృభాష ద్వారానే మనలోని భావాలను స్పష్టంగా వ్యక్తపరచగలమని చెప్పారు. తెలుగు భాషలోని పద్యాలు, కవితలు, గేయాలు, చందస్సు వాటికవే సాటి అని అన్నారు. దేశ భాషలందు తెలుగులెస్స అని శ్రీకృష్ణదేవరాయలు అన్నారని గుర్తు చేశారు. సంఘం సభ్యులు కొండపల్లి మాధవరావు, అజయ్ కుమార్, అరుణ్‌కుమార్, పి.చంద్రా నాయక్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బెజవాడలో మిస్టర్ పోలిశెట్టి సందడి



మాట్లాడుతున్న మిస్టర్ పోలిశెట్టి హీరో నవీన్

లబ్బీపేట(విజయవాడతూర్పు): సెప్టెంబర్ 7వ తేదీన విడుదల కానున్న మిస్‌శెట్టి మిస్టర్ పోలిశెట్టి సినిమాల్లోని హాస్య సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తాయని ఆ చిత్ర హీరో నవీన్ పోలిశెట్టి తెలిపారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా అనుష్క తన కంటే వయస్సు ఐదేళ్లు పెద్ద క్యారెక్టర్‌లో నటిస్తున్నారన్నారు. మహాత్మాగాంధీరోడ్డులోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హీరో నవీన్ మాట్లాడుతూ.. విజయవాడ నగరంతో తనకెంతో అనుబంధం ఉందని, ఇక్కడి నుంచే తన సినిమా ప్రమోషన్ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. మిస్టర్ పోలిశెట్టి సినిమాకు సంబంధించి టీజర్, ట్రైలర్‌కు ఇప్పటికే ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందని, దర్శకుడు మహేష్ తీసిన సన్నివేశాలు ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటాయన్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు నవీన్ తెలిపారు. తాను బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న ట్విల్స్ షోరూమ్ వద్దకు హీరో నవీన్ వెళ్లి కస్టమర్స్‌ను కలిశారు. మిస్టర్ పోలిశెట్టి సినిమా చూసి మొదటి రోజు టికెట్‌తో షాపింగ్‌కు వచ్చే వారికి ట్విల్స్‌లో 15 శాతం రాయితీ ఇస్తారని చెప్పారు.

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు

పెనమలూరు: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వర్షాలు పుష్కలంగా కురవాలని, రైతన్నలు ఆనందంగా జీవించాలని కోరుతూ పెనమలూరులో అంకమ్మతల్లికి భక్తులు పూజలు చేశారు. గ్రామంలో ఆదివారం నాయీబ్రాహ్మణుల కులదైవం ఆకునూరు అంకమ్మతల్లి దేవాలయంలో శ్రావణ మాసం సందర్భంగా నాయీ బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మాట్లాడుతూ ప్రతి ఏడాది శ్రావణమాసంలో తమ కులదైవాన్ని ప్రత్యేకంగా పూజిస్తామన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యంతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకుంటామని తెలిపారు. కాగా జిల్లాలో పలు ప్రాంతాల నుంచి భక్తులు పెనమలూరుకు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నాయీబ్రాహ్మణ కుల సంఘ పెద్దలు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.